క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ



గుడివాడ టౌన్: తారకరామా వాకర్స్‌క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక విజయవాడ రోడ్‌లోని చిన్నం గంగాధర్‌రావు ఇంటి వద్ద ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మజ్జిగ పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు ఎం.బ్రహ్మయ్య తెలిపారు. క్లబ్ సభ్యుడు నూకల అరుణ్ వితరణతో పంపిణీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పి. సతీష్‌బాబు, సీహెచ్ సుబ్రహ్మణ్యం, పి. సూరిబాబు, జి. రవీంద్ర కుమార్, కె. రామకృష్ణ, ఎం. వీరశేఖర్, డి. వి. సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత మధుమేహ వైద్యశిబిరం



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు గుడివాడకు చెందిన వైద్యురాలు గవిర్నేని రజనీ వైద్య పరీక్షలు చేశారు. దాతలు నర్రా గంగాధరరావు(వెస్టిండీస్), కొసరాజు బాపయ్యచౌదరి, వల్లభనేని రామకృష్ణ ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ శిబిరంలో 165 మందికి పరీక్షలు జరిగాయని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. 15 రోజులకు సరిపడా ఉచిత మందులను రోగులకు పంపిణీ చేశారు.

ఘనంగా అంకమ్మతల్లి సంబరాలు



తోట్లవల్లూరు: యాకమూరులో బోలెం వారి అంకమ్మతల్లి సంబరాలు ఘనంగా ముగిశాయి. గ్రామంలో మూడు రోజులుగా అంకమ్మతల్లి సంబరాలు వైభవోపేతంగా సాగాయి. చివరి రోజైన ఆదివారం తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల్లో నివశించే బోలెం వంశీకులు పెద్ద ఎత్తున అంకమ్మతల్లిని దర్శించుకుని పూజలు జరపటంతోపాటు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. ఆయా కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

ఉచిత వైద్యశిబిరం



గుడ్లవల్లేరు: డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 478 మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ వెంకట్రావు, గుండె, ఊపిరితిత్తులు తదితర సంబంధ వ్యాధులకు విజయవాడ కామినేని హాస్పటల్ వైద్యులు ఎస్.దాశరథి, లింగంశెట్టి వర్ధన్ సేవలను అందించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

భక్త కోలాహలంగా కొండలమ్మ సన్నిధి



గుడ్లవల్లేరు: తీవ్రమైన మండే ఎండల్లో సైతం శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధి అత్యధిక మంది భక్తులతో ఆదివారం కోలాహలంగా మారింది. భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వెబ్ కౌన్సెలింగ్‌ను వ్యతిరేకిస్తున్నాం



మండవల్లి: ప్రభుత్వం నిర్వహిస్తున్న వెబ్ కౌన్సెలింగ్‌ను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని స్థానిక విద్యావనరుల కేంద్రం వద్ద ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు ఆదివారం నిరసన తెలిపారు. మండల ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్ పెట్టుకోకుండా బహిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు మేడా శ్రీనివాసరావు, సీహెచ్ పిచ్చోడు, మాస్టర్ ఆనంద్‌కుమార్, అబ్దుల్ మస్తాన్, ఎస్.నాంచారయ్య పాల్గొన్నారు.

బాబోయ్.. ఎండలు!



కైకలూరులో ఎండకు నిర్మానుషంగా మారిన మార్కెట్ సెంటర్

- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- నిర్మానుషంగా రహదారులు

కైకలూరు: భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. రహదారులన్నీ నిర్మానుషంగా కనిపిస్తున్నాయి. కైకలూరులో ఆదివారం 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో వారం రోజులు పాటు ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ నిపుణులు చేస్తున్న హెచ్చరికలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అసలే ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నియోజకవర్గం నాలుగు మండలాల్లోనూ విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు లోఓల్టేజీ సమస్యను పరిష్కరించని కారణంగా ఏసీలు, ఫ్రీజ్‌లు, లైట్లు, ఫ్యాన్‌లు పాడవుతున్నాయి.

అల్లాడుతున్న ఆక్వా

సాధారణంగా చేపలు 29 డిగ్రీల నుంచి 30 డిగ్రీల ఉష్ణోగ్రత వరకు తట్టుకోగలవు. ఆక్వారంగం విస్తరించిన కొల్లేరు ప్రాంతాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కైకలూరు నియోజకవర్గంలో 84,852.4 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. మొత్తం 30,972 మంది రైతులు ఉన్నారు. వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రతలు పెరగడం, ఒక్క సారి వాతావరణం చల్లబడడంతో చెరువుల్లో ఆక్సిజన్ సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో వేలాది ఎకరాల్లో చేపలు మృత్యువాత పడుతున్నాయి.

వడదెబ్బతో జాగ్రత్త



వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. తల తిరగడం, వాంతులు కనిపిస్తే వడదెబ్బగా గుర్తించాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ కలిపిన నీటిని తాగించాలి.

– డాక్టర్ కిరణ్, కొల్లేటికోట, పీహెచ్‌సీ, కైకలూరు మండలం

బదిలీలపై విద్యాశాఖ పట్టు వీడాలి

గుడివాడ టౌన్: ఉపాధ్యాయ బదిలీలపై విద్యాశాఖ మొండిపట్టు వీడాలని మంత్రి తక్షణం జోక్యం చేసుకోవాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి సెకండరీ గ్రేడ్ టీచర్లకు వెబ్ కౌన్సెలింగ్ బదులుగా మాన్యువల్ కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని ఉద్యోగ సంఘాలకు విద్యాశాఖ సంచాలకులు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. స్వయంగా సంచాలకులు ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తూ శనివారం నుంచి కింది స్థాయి విద్యాశాఖ అధికారులతో వెబ్ ఆప్షన్ నమోదు చేయాలని ఎస్జీటీలపై బలవంతం చేయడం దారుణమని పేర్కొన్నారు. డీఈఓ కార్యాలయంలో మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని మొత్తుకుంటున్నా విద్యాశాఖ అధికారులు పెడచెవిన పెట్టడం సరికాదన్నారు. ఈ అంశంపై ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయం ముట్టడి, ఆందోళన చేస్తున్నా విద్యాశాఖ మంత్రి స్పందించక పోవడం విచారకరమని పేర్కొన్నారు. తక్షణమే విద్యాశాఖా మంత్రి జోక్యం చేసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. ఇమ్మానుయేల్, డి. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.

పంచాయతీలకు జమ అయ్యేది ఎప్పుడో?

ఏడాది నుంచి జమకాని స్టాంప్ డ్యూటీ నగదు



గుడివాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

పెదపారుపూడి: మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు గుడివాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వచ్చే స్టాంప్ డ్యూటీ నగదు ఏమవుతుందని పలు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెదపారుపూడి, గుర్విందగుంట, మహేశ్వరపురం, మోపర్రు, దోసపాడు, పాములపాడు, వానపాముల, జమిదింటకుర్రు, నాగాపురం తదితర గ్రామాల వారు గుడివాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. రిజిస్ట్రేషన్ జరిగిన తరువాత పంచాయతీ స్టాంప్ డ్యూటీలో కొంత నగదు సంబంధిత పంచాయతీలకు ట్రెజరీ ద్వారా బ్యాంక్ ఖాతాలో జమ చేయాలి. అయితే సంవత్సరం నుంచి స్టాంప్ డ్యూటీ నగదు ట్రెజరీ ద్వారా జమ కావటం లేదని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టాంప్ డ్యూటీ ద్వారా వచ్చే ఆదాయం పంచాయతీలో అభివృద్ధి పనులకు ఎంతో ఉపయోగపడేది అని కార్యదర్శులు చెబుతున్నారు. పామర్రు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగే వాటికి ట్రెజరీ ద్వారా నగదు జమ అవుతుందని కార్యదర్శులు అంటున్నారు. గుడివాడలో జరిగే రిజిస్ట్రేషన్లకు సంబంధించి మాత్రం నగదు సుమారు ఏడాది నుంచి జమ కావటం లేదు. ఇప్పటికైనా సబంధింత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు కోరుతున్నారు.

పంచాయతీలకు జమ కావటం లేదు

గుడివాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగే రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్టాంప్ డ్యూటీ నగదు పంచాయతీలకు జమ కావటం లేదు. 10 నెలల నుంచి ఎటువంటి నగదు పంచాయతీలకు రావటం లేదు. ట్రెజరీ వాళ్లను అడిగితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఏమీ రాలేదు అంటున్నారు. నగదు పంచాయతీలకు జమ అయితే అభివృద్ధి పనులకు ఉపయోగపడతాయి.

– సాగర రాణి, వెంట్రప్రగడ పంచాయతీ కార్యదర్శి

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



గ్రామ పార్టీ కమిటీలకు నియామక పత్రాలను అందిస్తున్న డీఎన్నార్

కైకలూరు: గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు పార్టీ కార్యాలయం లింగాల, కలిదిండి, సానారుద్రవరం గ్రామ పార్టీ కమిటీలకు నియామక పత్రాలను ఆదివారం అందించారు. కార్యక్రమంలో కైకలూరు, మండవల్లి మండలాల పార్టీ అధ్యక్షులు సింగంశెట్టి రాము, బేతపూడి ఏసేబురాజు, నాయకులు చెన్నంశెట్టి సోమేశ్వరరావు, నీలపాల వెంకటేశ్వరరావు, గరికపాటి సాయి పాల్గొన్నారు.

కనులపండువగా వెంకన్న కౌతుకోత్సవం



విశేష అలంకరణలో స్వామివారు



కౌతుకోత్సవ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కోడూరు: కలియుగ వైకుంఠ దేవుడు కల్యాణ వెంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా సాగుతున్నాయి. కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ యాగశాలలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. రేపల్లెకు చెందిన చిట్టా మురళీకృష్ణ– ప్రియాంక దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి కౌతుకోత్సవాన్ని భక్తిప్రపత్తులతో జరిపారు. నవకలశ స్నాపన ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కలశాలను ఆలయం చుట్టూ ఊరేగించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక జలాలతో స్వామివార్ల ఉత్సవమూర్తులకు అభిషేకాలను నిర్వహించారు. ఉత్సవమూర్తులను చందనంతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శనివారం రాత్రి ప్రధాన సెంటర్‌లో స్వామివారి రాయబారోత్సవాన్ని నిర్వహించారు. ఉపన్యాస వాచస్పతి మొవ్వ వృషాద్రిపతి వాఖ్యతగా వ్యవహరించి, స్వామి, అమ్మవార్ల గుణగణాలను భక్తులకు వివరించారు. బ్రహ్మోత్సవాల్లోని ప్రధాన ఘట్టాలను, విశిష్టతను అనుగ్రహభాషణ చేశారు. వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు ఉత్సవాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వెంకటేశ్వరుడి వేషధారణలో ఓ కళాకారుడు ఆకట్టుకున్నాడు.

స్వామివార్లకు పట్టువస్త్రాల సమర్పణ

కల్యాణోత్సవానికి ఉభయదాతలుగా వ్యవహరించిన దంపతులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. తమ నివాస గృహాల వద్ద నుంచి మంగళవాయిద్యాల నడుమ ప్రధాన రహదారి పొడవునా చలువబట్టలపై నడుచుకుంటూ వచ్చి వస్త్రాలను పండితులకు అందజేశారు. రాత్రికి కల్యాణం, సోమవారం వాహనసేవలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ తెలిపారు. ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

భ్రమరాంబ మల్లికార్జున స్వామి విగ్రహ పునఃప్రతిష్ట



మండవల్లి: మండలంలోని భైరవపట్నం శివారు శోభనాద్రిపురంలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం బ్రహ్మశ్రీ రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రి బ్రహ్మత్వంలో ఆదివారం ఉదయం జరిగింది. అనంతరం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. భైరవపట్నానికి చెందిన గాదిరాజు ఈశ్వరరాజు ఆర్థిక సాయంతో అన్న ప్రసాద వితరణ చేశారు.

అన్నసమారాధన



మండవల్లి భక్తాంజనేయస్వామి ఆలయంలో అన్న సమారాధన

మండవల్లి: మండవల్లి సెంటర్‌లోని భక్తాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం రాత్రి భారీ అన్నసమారాధన జరిగింది. మండవల్లి పరిసర గ్రామాలైన కొర్లపాడు, పెరికెగూడెం, గన్నవరం, అయ్యవారిరుద్రవరం తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు.

హాస్టల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ముదినేపల్లి రూరల్: స్థానిక ప్రభుత్వ బీసీ హాస్టల్లో బాలుర ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ వి.సురేష్‌బాబు తెలిపారు. పాఠశాలలు ఈ నెల 12 నుంచి ప్రారంభం కానుండున మూడు నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు హాస్టల్లో ప్రవేశాలు కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు విద్యార్థులతో కలిసి హాస్టల్లో సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ట

ఘంటసాల: ఘంటసాల గ్రామం ఆదివారం శ్రీకృష్ణ నామ స్మరణతో మార్మోగింది. ఘంటసాల గ్రామంలో వేం చేసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ బాల పార్వతీ జలధీశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మించిన శ్రీ కృష్ణ ద్వారక ఆలయం శిఖర, శ్రీకృష్ణ పరమాత్ముని విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ చావలి దుర్గామల్లికార్జున దీక్షితులు ఆధ్వర్యంలో తెల్లవారు జామున 5 గంటలకు నిత్యవిధి, గర్తన్యాసము పూజలు నిర్వహించి ఉదయం 7.42 గంటలకు శ్రీకృష్ణ ద్వారకా ఆలయ శిఖర, శ్రీకృష్ణ పరమాత్ముని విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు.

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే కర్తవ్యం



ఉయ్యూరు: సంస్కృతి, సంప్రదాయ, సనాతన ధర్మ పరిరక్షణే కర్తవ్యంగా యువత ముందుకు సాగుతూ సమాజానికి ఆదర్శవంతంగా నిలవాలని భగవద్గీత ఉపన్యాసకులు రాధా మనోహర్ దాస్ స్వామీజీ అన్నారు. ఉయ్యూరు పట్టణంలో న్యాయవాది గుండు శ్రీకృష్ణ నివాసానికి ఆదివారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా విశ్వ హిందూ సమితి సభ్యులు రాపిరెడ్డి హరీష్, చలపాటి రామాంజనేయులు, గొల్లపూడి నాగరాజు, రాపిరెడ్డి సురేష్ బృందం స్వామీజీని కలిసి సత్కరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల కరపత్రం ఆవిష్కరించారు. రాధా మనోహర్ దాస్ స్వామీజీ మాట్లాడుతూ సాంకేతికత అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి చేరుకోవటంతో పాటుగా ప్రతి ఒక్కరి హృదయం భగవంతుడి ధ్యానంతో నిండిపోవాలన్నారు. ఇటీవల హనుమజ్జయంతి సందర్భంగా ఉయ్యూరులో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించిన సభ్యులను అభినందించారు.

స్మార్ట్‌మీటర్లపై పునరాలోచించాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ టౌన్: గృహాలకు స్మార్ట్‌మీటర్లు బిగించే అంశంలో స్థానిక ప్రజాప్రతినిధులు పునరాలోచన చేయాలని సీపీఎం గుడివాడ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయ పంప్‌సెట్లకు స్మార్ట్‌మీటర్లు బిగిస్తుంటే టీడీపీ నాయకులు బాదుడే బాదుడు అంటూ ప్రభుత్వాన్ని ఎండగట్టారన్నారు. తిరిగి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించే కార్యక్రమం చేపట్టిందన్నారు. అయితే ఈ విషయం మంగళగిరి నియోజకవర్గం ప్రజలు తిరస్కరించారన్నారు. మీటర్లు బిగించడం అడ్డుకోగా పాత మీటర్లే కొనసాగేలా చర్యలు చేపట్టారన్నారు. మంత్రి నియోజకవర్గంలో జరుగుతున్న విధానాన్ని ఆదర్శంగా తీసుకుని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సైతం ఈ విషయంలో జోక్యం చేసుకుని ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు అమర్చకుండా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు రేపాని కొండ పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్స్-2025కు విద్యార్థుల ఎంపిక

మొవ్వ: ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన వారికి అందించే షైనింగ్ స్టార్స్–2025 ప్రతిభ అవార్డులకు మొవ్వ మండలంలో ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారి ధికారి–1 ఎస్.శివశంకరరావు ఆదివారం వెల్లడించారు. మచిలీపట్నం జెడ్పీ కన్వెన్షన్ హాల్లో సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే సభలో నగదు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేస్తారని పేర్కొన్నారు. వీరిలో ఆరుగురు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల విద్యార్థులు కాగా ఒకరు మొవ్వ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని అని తెలిపారు. జనరల్ కేటగిరిలో మొవ్వ హోలీ స్పిరిట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థినులు తిరుమలశెట్టి నిఖితసాయి (575), పోటు చోహిత లాస్య సాయి (482), రాయల మహాశివరాణి(583), వెనుకబడిన తరగతుల కేటగిరీలో కోసూరు విజయశ్రీ సన్ ఫ్లవర్ (ఇంగ్లిష్/తెలుగు మీడియం) పాఠశాల విద్యార్థిని వక్కలగడ్డ తేజేశ్వని(582), మొవ్వ హోలీ స్పిరిట్ ఇంగ్లిష్ మీడియం విద్యార్థి పామర్తి వెంకటసాయి యశ్వంత్ (588), షెడ్యూల్ కులాల కేటగిరిలో అదే పాఠశాలకు చెందిన వడ్డిముక్కల అన్విత జోయ్ (591), షెడ్యూల్ తెగల కేటగిరిలో మొవ్వ పీఎం శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని కూతాడి వైశాలి(508) ఎంపికైనట్లు ఎంఈఓ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మండవల్లి హైస్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మండవల్లి: మండవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 1990–91 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాలతో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అప్పటి విద్యార్థులు ఒకరినొకరు కుశల ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను తలచుకున్నారు. అప్పటి గురువులైన లెక్కల టీచర్ కె.సూర్యారావు, డ్రాయింగ్ టీచర్ ఎల్ఎస్ భాస్కరరావు, తెలుగు టీచర్ ఏకే మహాలక్ష్మి, ల్యాబ్ అసిస్టెంట్ బుజ్జిని సన్మానించారు.

కోడూరు రోడ్డుకు మోక్షం ఎప్పుడో?



అధ్వానంగా మారిన రోడ్డు

ముదినేపల్లి రూరల్: జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న మండలంలోని కోడూరుకు వెళ్లే ఆర్ అండ్‌బీ రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి వెంబడి చేపల చెరువులకు భారీ వాహనాలు మేతలతో ప్రతినిత్యం ప్రయాణిస్తుండడంతో రహదారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. గతంలో ఉన్న తారురోడ్డు ప్రస్తుతం స్వరూపాన్ని కోల్పోయి డొంక రోడ్డుగా మారి గోతులమయంగా తయారైంది. కత్తిపూడి–పామర్రు జాతీయ రహదారి నుంచి గ్రామములోకి సుమారు మూడు కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రోడ్డు ద్విచక్ర వాహనాలు ప్రయాణించేందుకు సైతం అవకాశం లేకుండా పోయింది. గతంలో గ్రామంలోకి వెళ్లే ఆర్టీసీ బస్సును సైతం రద్దు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో గ్రామానికి వెళ్లాలన్నా, ఇతర ప్రాంతాలకు ప్రయాణించాలన్నా ఆటోలు సైతం ప్రయాణించేందుకు వీలులేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

చల్లపల్లి: సాగులో సరైన యాజమాన్య పద్ధతులను అవలంభించినప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త జి.కృష్ణవేణి రైతులకు సూచించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం(ఘంటసాల) ఆధ్వర్యంలో మండల పరిధిలోని మాజేరు గ్రామంలో ఆదివారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కృష్ణవేణి మాట్లాడుతూ విత్తన శుద్ధి, భూసార పరీక్షలకు, పరిసరాల ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని వరి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. సరైన సమయంలో సరైన మోతాదులో మందులు వాడటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వ్యవసాయ రంగంలో రైతులకు సబ్సిడీపై అందించే వివిధ వ్యవసాయ పరికరాలు, పనిముట్ల మంజూరు వంటి విషయాలను ఏఓ సాయి సింధూ వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు డాక్టర్ సత్యప్రియ లలిత, ఎస్.శ్యామలాదేవి, ఉద్యానవన శాఖ అధికారి కీర్తి, రైతులు పాల్గొన్నారు.

పాండురంగడి ఆలయానికి పోటెత్తిన భక్తులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని చిలకలపూడిలో వేం చేసి ఉన్న శ్రీ పాండురంగస్వామి వారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం కావటంతో పాటు మసులా బీచ్ ఫెస్టివల్‌కు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ప్రజలు పాండురంగ స్వామి ఆలయనికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని తరించారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని పలు ఉపాలయాల్లో కొలువుదీరిన స్వామి, అమ్మవార్లను కూడా భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్మాహకుడు టేకి నరసింహం తీర్థప్రసాదాలను అందజేశారు. బీచ్ ఫెస్టివల్‌కు వెళ్లి సముద్ర స్నానాలు ఆచరించిన భక్తులు తిరుగు ప్రయాణంలో ఆలయానికి వచ్చే వీలు లేకుండా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించటంతో స్వామి వారిని దర్శించుకునే వీలులేక పలువురు భక్తులు నిరాశ చెందారు.